ఆంధ్రజ్యోతి
మహబూబ్‌నగర్
3
సోమవారం 13 మే 2024



విద్యుత్ స్తంభానికి బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ఆత్మకూరు/అమరచింత, మే12: ద్విచక్ర వాహనంపై వెళ్తూ విద్యుత్ స్తంభానికి ఢీకొట్టుకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా అమరచింత మండలంలో చోటు చేసుకున్నది. స్థానికులు, ఎస్ఐ సురేష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నచింతకుంట మండలం గూడూరు గ్రామానికి చెందిన అంజనేయులు, బీసన్నలు గద్వాల మండలంలో వలస కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం గూడూరు గ్రామంలో బంధువుల అంత్యక్రియలకు వెళ్లారు. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం ఆదివారం గద్వాల జిల్లాకు బయలు దేరారు. ఈ క్రమంలో అమరచింత మండలంలోని చంద్రగట్టు శివారులోని ద్విచక్ర వాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంజనేయులు (35) అక్కడికక్కడే మృతి చెందగా బీసన్న తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, బంధువులు ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సురేష్ తెలిపారు. ఆంజనేయులుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సమాచారం.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలు

అచ్చంపేటటౌన్, మే 12: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గ్రాయాలైన సంఘటన ఆదివారం పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం సమీపంలో చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్రాబాద్ మండలం మన్ననూర్ గ్రామానికి చెందిన బుచ్చయ్య అచ్చంపేట పట్టణానికి వచ్చి తిరిగి తన ద్విచక్ర వాహనంపై మన్ననూర్‌కు వెళుతుండగా అటవీశాఖ కార్యాలయం వద్ద ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వ్యక్తి స్థానికులు అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కల్లాల్లోనే ధాన్యం

- ఒక్కసారిగా పడిపోయిన ధరలు
- వర్షాకాలం సమీపిస్తుండటంతో రైతుల ఆందోళన

ఆత్మకూరు, మే 12: వర్షాభావ పరిస్థితులు ఒకవైపు ఎండల తీవ్రత మరోవైపు ఉన్నా ఆరుగాలం కష్టపడి రైతన్న పండించిన పంటకు నేడు గిట్టుబాటు ధరలు లేక కల్లాల్లోనే ధాన్యం నిల్వ ఉంచుకునే దుస్థితి నెలకొంది. గతేడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో పంటలు అంతంతమాత్రంగా పండిన సన్నరకాలకు అధికంగా ధరలు ఉండడంతో రబీ సీజన్‌లో కూడా అదే ధరలు ఉంటాయని ఆశించిన రైతులు జూరాల ఎడమ కాలువ ద్వారా సాగునీరు విడుదల చేయకపోయినా కాలువ పరిసర ప్రాంతాల, బోరు బావుల క్రింద రైతులు సన్న రకాలను సాగు చేశారు. మార్చి చివరి మాసం ఏప్రిల్ మొదటి మాసంలో వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 2400 నుంచి రూ. 2600 వరకు మద్దతు ధర రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధికంగా రావడంతో రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురాకుండా రైస్ మిల్లర్లు కమీషన్ ఏజెంట్లకు ధాన్యాన్ని విక్రయించారు.



ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు

సార్వత్రిక ఎన్నికల కారణంగా..

ఏప్రిల్ మూడో వారం నాటికి ఒక్కసారిగా ధాన్యం ధరలు రూ. 2,200లకు పడిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఎకరాకు రూ. 30వేలకు పైగా పెట్టుబడులు పెట్టి పంటలు పండిస్తే కనీసం 20 నుంచి 25 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో 45రోజులుగా రైతులు ధాన్యాన్ని కల్లాల్లోనే ఉంచుకుంటున్నారు. ధాన్యం రేటు ఒక్కసారిగా పడిపోవడానికి కారణమేంటని రైతులు, రైస్ మిల్లర్లను అడుగగా సార్వత్రిక ఎన్నికలు ఉండడంతో ఖరీదుదారులు రావడం లేదని, దీని ద్వారా మార్కెట్ నిలిచిపోయిందని సమాధానం ఇస్తున్నారు.

రూ. 500 బోనస్ ఇవ్వాలి

రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సింది పాలక ప్రభుత్వాలే ప్రతీ ఏటా ధాన్యానికి రూ. 100 నుంచి రూ. 120 మాత్రమే పెంచి చేతులు దులుపుకుంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ ఇచ్చే బోనస్‌ను ఖరీఫ్ సీజన్ నుంచి ఇస్తామని ప్రకటించడం సరికాదని రైతులు అంటున్నారు. యాసంగి సీజన్ ప్రారంభానికి ముందే రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడిందని, ఖరీఫ్ సీజన్‌లో ప్రకటించే బోనస్‌ను రైతులు ధరలు లేక ఇబ్బందులు పడుతున్న యాసంగి సీజన్‌లోనే ప్రకటిస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుంది కదా అని అంటున్నారు.



కల్లాల్లోనే నిల్వ ఉంచిన ధాన్యం రాశులు

ప్రస్తుతం వర్షాకాలం సమీపిస్తున్న కారణంగా వర్షాలు కురిస్తే వడ్లు తడిసిపోయే అవకాశం ఉంది. దీని ద్వారా ధాన్యం రాశులపై టార్పాలిన్ కవర్లు కప్పుకొని రాత్రింబవళ్లు కావలి కాసే పరిస్థితి దాపురించింది. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పంట కోసి 40 రోజులు గడుస్తుంది



పంట కోసి 40 రోజులు గడుస్తుంది. కల్లాల్లోనే ధాన్యం రాశులకు కాపలాగా ఉంటున్నాం. మొదట్లో పచ్చి ధాన్యానికి రూ. 2400 పలికిన ధర వట్టి ధాన్యానికి కూడా అదే ధర ఇస్తామని అంటున్నారు. ఇదేంటని అడిగితే మార్కెట్ పడిపోయిందంటూ మిల్లర్స్ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారు. ఎకరాకు రూ. 30వేలకు పైగా పెట్టుబడులు పెట్టి పండిస్తే కనీసం పెట్టుబడులు కూడా ఎల్లని పరిస్థితి ఏర్పడింది.

- దేవేందర్, వరి రైతు

బోనస్ ప్రకటించి రైతులను ఆదుకోవాలి



కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకున్నప్పుడే పాలక ప్రభుత్వాలపై రైతులకు నమ్మకం కలుగుతుంది. ఖరీఫ్ సీజన్‌లో ఇస్తామన్న బోనస్ రూ.500లను రబీ సీజన్‌లోనే ప్రకటిస్తే మద్దతు ధర, బోనస్ కలిసి క్వింటాల్‌కు రూ. 2700 ధర వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం స్పందించి తక్షణమే ధాన్యానికి బోనస్‌ను ప్రకటించి కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

- ఎస్.రాజు, సీపీఎం జిల్లా నాయకులు

ఉద్యోగికి అస్వస్థత

అచ్చంపేట, మే 12: పార్లమెంట్ ఎన్నికల విధులకు హాజరైన ఆర్ అండ్ బీ జూనియర్ అసిస్టెంట్ వెంకటస్వామి ఆదివారం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ యార్డు ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద ఒక్కసారిగా అస్వస్థత కు గురై పడిపోవడంతో అక్కడే ఉన్న వైద్యాధికారి తారాసింగ్ సీపీఆర్ చేసి వైద్యం అందించారు. అనంతరం 108 అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు.



అస్వస్థతకు గురైన వ్యక్తికి వైద్యం అందిస్తున్న వైద్యాధికారి తారాసింగ్

ప్రమాదవశాత్తు చెరకు పంటకు నిప్పు

- 12ఎకరాలల్లో చెరకు పంట అగ్నికి ఆహుతి

తాడూరు, మే 12 : మండలంలోని తుమ్మలసూగురు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు రైతులు శ్రీనివాస్‌రెడ్డి, జోగిరెడ్డి, జనార్ధన్‌రెడ్డిలు సాగు చేసుకున్న ఎనిమిదిఎకరాల చెరకు పంటకు నిప్పు అంటుకుంది. మంటలు రేగడంతో గమనించిన గ్రామస్థులు, రైతులు ఆర్పేందుకు ప్రయత్నించినా సాధ్యపడలేదు. దీంతో అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చినప్పటికీ వారు ఆ సమయంలో బిజీగా ఉండడం మూలంగా సమయానికి రాలేకపోయారు. దీంతో చెలరేగిన మంటలకు గాలి తోడవడంతో మరింత వేగంగా పంట మొత్తం నిప్పు అంటుకుని అగ్నికి ఆహుతైంది. దీంతో ఆరుగాలం కష్టపడి చేతికొచ్చే సమయంలో చెరుకు పంట పూర్తిగా అగ్నికి ఆహుతి కావడంతో సాగు చేసుకున్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పంటకు నష్ట పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



తాడూరు మండలం తుమ్మలసూగురు గ్రామంలో ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అవుతున్న చెరకు పంట

విద్యుదాఘాతంతో కూల్‌డ్రింక్ షాపు దగ్ధం



విద్యుదాఘాతంతో దగ్ధమైన కూల్‌డ్రింక్ షాపు

లింగాల, మే 12 : నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల గ్రామ సచివాలయం వద్ద మార్కెట్‌లో గల కూల్ డ్రింక్ షాపు విద్యుదాఘాతంతో దగ్ధమైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. కూల్ డ్రింక్ షాపు యజమాని జబ్బార్ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే శనివారం కూల్ డ్రింక్ షాపులో రాత్రి తొమ్మిది గంటల వరకు అమ్మకాలు నిర్వహించి షాపునకు తాళం వేసి వచ్చామన్నారు. ఆదివారం ఉదయం షాపులో నుంచి మంటలు, పొగలు వస్తుండడాన్ని గుర్తించిన వారు తమకు సమాచా రమందించడంతో వెళ్లి చూడగా షాపులో గల పెద్ద కూలర్, కూలింగ్‌కు సంబంధించిన యంత్రాలు, పరికరాలు, ఫర్నీచర్ కరెంటు షార్ట్ సర్క్యూట్ వల్ల పూర్తిగా దగ్ధమైనట్లు వెల్లడించారు. షాపు పాక్షికంగా దెబ్బతినగా సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిపారు. షాపులో విద్యుత్ వినియోగంలో అన్ని జాగ్రత్తలు పాటించిన షార్ట్ సర్క్యూట్ ఏర్పడటం తమను కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

- రూ. 60వేలు అపహరణ



చెల్లాచదురుగా వేసిన వస్తువులు

నాగర్‌కర్నూల్ క్రైం, మే 12 : తాళం వేసిన ఇంటికి కన్నం వేసి 55వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు, ఒక ట్యాబ్ అపహరించుకెళ్లిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఈశ్వర్ కాలనీలో చోటు చేసుకున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం... జిల్లా కేంద్రంలోని ఈశ్వర్ కాలనీలో నివాసం ఉంటున్న జీవన్ శనివారం మధ్యాహ్నం సొంత పని మీద కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లాడు. రాత్రి దాదాపుగా 10గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చేసరికి తలుపులు విరగగొట్టి లోపలికి ప్రవేశించి దొంగతనానికి పాల్పడినట్లు బాధితులు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

కబడ్డీలో రాణిస్తున్న క్రీడాకారులు

- వేసవిలో ప్రత్యేక శిక్షణ శిబిరం
- ఉదయం, సాయంత్రం ఇండోర్ స్టేడియంలో సాధన

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 12 : వేసవి శిక్షణ శిబిరాలతో మైదానాలు, అకాడమీలు, ఇండోర్ స్టేడియాలు కళకళలాడుతున్నాయి. జిల్లా క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో 20పైగా వేసవి శిబిరాలు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో జిల్లా క్రీడా శాఖ సహకారంతో జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ఔత్సాహిక గ్రామీణ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందజేస్తున్నారు. క్రీడాశాఖ క్రీడాకారులకు ఉండేందు వసతి కల్పించడంతో కబడ్డీ సంఘం క్రీడాకారులకు ఇక్కడ భోజన వసతి కల్పించింది. ఉదయం, సాయంత్రం నిష్ణాతులైన కోచ్‌ల పర్యవేక్షణలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జిల్లా కబడ్డీ సంఘం అధ్యక్షుడు శాంతికుమార్ కబడ్డీ క్రీడాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారు. ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉండి ప్రోత్సహిస్తున్నారు. నెలాఖరు వరకు కొనసాగే ఈ క్యాంపుల్లో కబడ్డీ శిక్షణ ఇస్తూ మెళకువలు నేర్పుతుండడంతో క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి వస్తున్నారు. ఇప్పటికీ పలువురు గ్రామీణ క్రీడాకారులు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



వేసవిలో శిబిరంలో శిక్షణ పొందుతున్న కబడ్డీ క్రీడాకారులు


వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



జిల్లా క్రీడాశాఖ, కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిబిరాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలి. కబడ్డీ క్రీడాభివృద్ధికి శాంతకుమార్ సార్ సహకారంతో ఎంతో ఉంది. అందరి సహకరంతో కబడ్డీ క్రీడాభివృద్ధి మరింత కృషి చేస్తాం.

- కురుమూర్తిగౌడ్, జిల్లా కబడ్డీ సంఘం సెక్రటరీ

క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం



జిల్లాలో క్రీడాభివృద్ధికి తన వంతు కృషి చేస్తాను. జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలన్నదే నా ఆకాంక్ష. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారుల కొదువ లేదు. వేసవి శిబిరాల్లో క్రీడాకారులు తమ ప్రతిభ చాటాలి. ప్రతిభ గల క్రీడాకారులకు అండగా ఉంటా.

- శాంతకుమార్, కబడ్డీ సంఘం జిల్లా అధ్యక్షుడు

శిక్షణ చాలా బాగుంది



ఇండోర్ స్టేడియంలో వేసవి కబడ్డీ శిబిరంలో శిక్షణ చాల బాగా ఇస్తున్నారు. కోచ్ సార్ రోజు ఉదయం,సాయంత్రం శిక్షణతో పాటు కబడ్డీపై అవగహన కల్పిస్తున్నారు. రాష్ట్రస్థాయి టోర్నీ ఆడాను. ఇటివలే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైయ్యాను. భవిష్యత్తు భారత జట్టుకు ఆడాలన్నదే నాలక్ష్యం.

- మౌనికా, కబడ్డీ క్రీడాకారిణి, రాజాపూర్

ప్రో కబడ్డీ ఆడాలని ఉంది



జిల్లా క్రీడాశాఖ, కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది వేసవి శిబిరాలు నిర్వహించి గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. కబడ్డీ సంఘం కృషితో రెండు సార్లు, రాష్ట్రస్థాయిలో, ఒక సారి జాతీయస్థాయి పోటీల్లో ఆడాను. ప్రోకబడ్డీ ఆడాలని ఉంది.

- పాండునాయక్, అడ్డాకుల మండలం, తిమ్మాయిపల్లి తండా



ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 38.0 | కనిష్ఠం : 27.0



సామగ్రితో కేంద్రాలకు తరలుతున్న సిబ్బంది

నేడే లోక్ సభ పోలింగ్

- ఉమ్మడి జిల్లాలోని రెండు ఎంపీ నియోజకవర్గాల్లో ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి
- ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఓటింగ్
- పోలింగ్ స్టేషన్‌లకు తరలిన ఈవీఎంలు, వీవీప్యాట్‌లు
- వలస ఓటర్ల రాక
- పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు
- సమస్యాత్మక ప్రాంతాలపై కేంద్ర బలగాల నిఘా
- మహబూబ్‌నగర్ పరిధిలో 31 మంది.. నాగర్‌కర్నూల్ పరిధిలో 19 మంది పోటీ



మహబూబ్‌నగర్‌లోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం వద్ద సిబ్బంది

మహబూబ్‌నగర్, మే 12: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ పార్టీల నాయకులు నెల రోజులుగా హోరెత్తించిన ప్రచారానికి తెర పడింది. నువ్వా.. నేనా.. అన్నట్లు ఒకరిపై ఒకరు ఆరోపణలు.. ప్రత్యారోపణలు.. సవాళ్లు.. ప్రతి సవాళ్లు చేసుకున్నారు. సై అంటే సై అన్నట్లు ఎన్నికల కురుక్షేత్రంలో తలపడ్డారు. శనివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారం ముగియగా.. నేడు సోమవారం మరికొద్ది సేపట్లో ఓటింగ్ ప్రారంభం కానుంది. ఎన్నికలకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగనుంది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పరిధిలో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఆయా కేంద్రాలకు కేటాయించిన సిబ్బందిని, ఎన్నికల సామగ్రి ఈవీఎంలు, వీవీపాట్‌లను పంపించారు.

ఓటరు నాడిపై టెన్షన్

ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఆయా పార్టీలలో ఓటరు నాడి ఎటువైపు ఉంటుందోనన్న టెన్షన్ మొదలైంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి 31 మంది, నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు 19 మంది అభ్యర్థులు తలపడుతున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలతో పాటు బీఎస్పీ, స్వతంత్రులు కూడా జోరుగా ప్రచారం నిర్వహించారు.

ఓటర్లు ఇలా..

మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో 16,80,348 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుష ఓటర్లు 8,20,016 కాగా, మహిళా ఓటర్లు 8,48,289 మంది ఉన్నారు. ఇతరులు 43 మంది ఉన్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో 1,937 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో 17,34,773 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 8,64,034 మంది ఉండగా, మహిళా ఓటర్లు 8,70,694 మంది, ఇతరులు 45 మంది ఉన్నారు. ఇక్కడ 1,944 పోలింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేశారు.

భారీ పోలీస్ బందోబస్తు

పార్లమెంట్ ఎన్నికలకు భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల వద్ద కేంద్ర బలగాలను మొహరిస్తున్నారు. రెండు పార్లమెంట్‌ల పరిధిలో దాదాపు ఏడు వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. అందులో వెయ్యి మంది వరకు కేంద్రబలగాలు ఉన్నాయి. కర్ణాటక నుంచి కూడా కొన్ని బలగాలను రప్పించారు. అన్ని పోలింగ్ స్టేషన్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనుంది. పోలింగ్ స్టేషన్‌లకు 100మీ దూరంలో ఎవరూ గుంపులుగా ఉండటానికి వీలులేదు. పోలింగ్ నిర్వహణ అనంతరం ఈవీఎంలు, వీవీపాట్ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించే వరకు అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు ఎస్పీ హర్షవర్ధన్ ఆదేశాలిచ్చారు. డీఐజీ, ఎస్పీలు బందోబస్తును ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నారు.

తరలివస్తున్న వలస ఓటర్లు

ఎన్నికలను రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో వలస ఓటర్లను రప్పిస్తున్నారు. రాను, పోను చార్జీలు ఇస్తామని హైదరాబాద్, ముంబై వంటి నగరాల్లో ఉన్న ఓటర్లను పిలిపిస్తున్నారు. అందుకోసం స్థానిక నాయకులతో మాట్లాడుతున్నారు. దీంతో ఆదివారం చాలామంది వివిధ ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు సొంతూళ్లకు చేరుకున్నారు.

ఓటింగ్‌కు దూరంగా ఉండాలని ఎదిర గ్రామస్థుల నిర్ణయం

మహబూబ్‌నగర్ మునిసిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డుకు చెందిన ఎదిర గ్రామస్థులు పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్‌ను బహిష్కరించాలని నిర్ణయించారు. అక్కడ ఏర్పాటు చేస్తున్న అమర్‌రాజా బ్యాటరీల పరిశ్రమ వల్ల కాలుష్యం వెదజల్లితే తమ గ్రామం పాడవుతుందని చాలా రోజులుగా గ్రామస్థులు ఈ పరిశ్రమను వ్యతిరేకిస్తున్నారు. అమర్‌రాజా పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో 58 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నారు. పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేయొద్దని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎన్నికల ప్రచారం కూడా జరగడం లేదు. ఎదిరలో 94, 95, 96 బూత్‌లు ఉన్నాయి. 94వ పోలింగ్ బూత్‌లో 1,125 మంది ఓటర్లు ఉన్నారు. 95వ బూత్‌లో 1,350 మంది, 96వ బూత్‌లో 764 మంది చొప్పున మొత్తం 3,299 మంది ఓటర్లు ఉన్నారు. నేడు ఓటింగ్ సందర్భంగా ఏం జరుగుతుందోనన్న ఉత్కంఠ నెలకొంది.



ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది



పోలీసు బందోబస్తు మధ్య బస్సులో వెళ్తున్న ఎన్నికల సిబ్బంది



ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు

కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది

పార్లమెంట్ ఎన్నికలు సోమవారం జరుగనుండటంతో సిబ్బంది ఆదివారం సాయంత్రమే సామగ్రితో ఆయా పోలింగ్ స్టేషన్‌లకు బయలుదేరి వెళ్లారు. మహబూబ్‌నగర్ అసెంబ్లీకి సంబంధించి పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో పోలింగ్ అధికారులు, సిబ్బందికి ఈవీఎం, వీవీపాట్, ఇతర సామాగ్రి అందజేశారు. 32 బస్సులలో పోలీస్ బందోబస్తుతో వారిని బూత్‌లకు తరలించారు. కలెక్టర్ రవిగుగులోత్ ఈ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు ప్రక్రియ సజావుగా సాగేలా యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. ఉదయం 5:30 గంటలకల్లా అధికారులు పోలింగ్ స్టేషన్‌లకు చేరుకుని మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం అవుతుందన్నారు. సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ సమయంలోగా ఎవరు వచ్చినా వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఎన్నికల అనంతరం పోలీస్ బందోబస్తు నడుమ ఈవీఎం, ఎన్నికల సామగ్రిని పాలమూరు యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాల్సి ఉంటుందన్నారు. అధికారులు, పోలీసులు ఎన్నికలు సజావుగా కొనసాగేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్పీ హర్షవర్ధన్, అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, ట్రైనీ కలెక్టర్ పాల్గొన్నారు.

- పట్టణంలోని టీడీగుట్టలో మోడల్ పోలింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. ముఖ ద్వారాన్ని పూలతో డెకరేషన్ చేసి, గ్రీన్‌మ్యాట్ పరిచారు.





సామగ్రిని సరి చూసుకుంటున్న సిబ్బంది; విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి గుగులోతు

పార్లమెంటు ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాల ఏర్పాట్లు
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్

మిడ్జిల్, మే 12 : జడ్చర్ల నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్ వెల్లడించారు. ఆదివారం జడ్చర్ల పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఈవీఎంలు, ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం అధికారులు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధరణ పరిశీలకులు షెవాంగ్ గ్యాచో భూటియా, ఎస్పీ హర్షవర్ధన్, ఏఆర్‌వో మోహన్‌రావులతో కలిసి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జి. రవినాయక్ విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలోని మొత్తం 2 లక్షల 22వేల 838 మంది ఓటర్లున్నాట్లు తెలిపారు. పురుషులు లక్ష 11వేల 53 మంది, మహిళా ఓటర్లు లక్ష11వేల 779, ఇతరులు 6మంది ఓటర్లు ఉన్నారని వివరించారు. నియోజకవర్గంలోని మొత్తం పోలింగ్ కేంద్రాల సంఖ్య 274, ఎన్నికలకు సిబ్బంది 1300, రూట్స్ 30, సెక్టోరియల్ అధికారులు 70 మందిని నియమించినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు అన్ని వసతులను కల్పించడం జరిగిందన్నారు. దివ్యాంగులు, వృద్దుల కోసం ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద వీలుచైరును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని వివరించారు. దీంతో పాటు సిబ్బందికి పలు సూచనలు అందజేశారు. ఈవీఎం, పోలింగ్ సామాగ్రితో సిబ్బంది, సాయుధ బలగాలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాలలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు తదితరులున్నారు.


ఈవీఎంలు, ఎన్నికల సామగ్రితో వెళుతున్న సిబ్బంది

వేంకటేశ్వరస్వామి ఆలయంలో

వంశీచంద్ దంపతుల పూజలు


వేంకటేశ్వరస్వామి ఆలయంలో వంశీచంద్‌రెడ్డి దంపతులు

మహబూబ్‌నగర్, మే 12 : మహబూబ్‌నగర్ పట్టణంలోని కాటన్‌మిల్లు వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ శంకరాచార్యులు జయంతి సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందెడ్డి, తన భార్య ఆశ్లేషారెడ్డితో కలిసి పూజలు చేశారు. వేద పండితులు వారిని శాలువాలతో సత్కరించారు. పాలమూరు ప్రాంతంలో ప్రతీ ఎకరాకు సాగునీరందాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎన్నో ఆశలతో ఏర్పడిన కొత్త ప్రభుత్వంలో ప్రతీ నిరుద్యోగికి ఉద్యోగ ఉపాధి అవకాశాలతో పాటు మెరుగైన విద్య, వైద్యం అందేలా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని భగవంతుడిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా మదర్స్ డే


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న భక్తరాజు, శేఖర్

చిన్నచింతకుంట, మే 12 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కమ్యూనిటీ హాల్‌లో అమ్మా సేవా సమితి నిర్వాహకులు భక్తరాజు ఆధ్వర్యంలో మదర్స్ నర్సింగ్ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులను, రోగులకు పాలు, బ్రెడ్లు అందజేశారు. తల్లి ప్రాధాన్యతను, విశిష్టతను, చిన్నప్పటి నుంచి తల్లి ప్రేమను ఎలా తన పిల్లలను పంచుతుంది అన్నదానిపై సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.శేఖర్, శ్రీలత, తులసి, నంబిజ్యోతి, నాయకులు ఎంకే విజయ్, సుదర్శన్, నెహమియా, తేజ, రాహుల్ పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం

మిడ్జిల్ : పట్టణంలోని పద్మావతి కాలనీలో మన సేవా సమితి ఆధ్వర్యంలో మాతృ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు వి.వేణు గోపాల్ మాట్లాడుతూ తల్లి ప్రేమను వెలకట్టలేమన్నారు. తల్లికి సంతానం ఎందరు ఉన్నా అందరినీ సమానంగా, ప్రేమతో పెంచడం తల్లికే సాధ్యమవుతుందన్నారు.

హీరో సుమన్ చేతులమీదుగా

వడ్డెమాన్ రాజేంద్రకు అవార్డు ప్రదానం


హీరో సుమన్ చేతులమీదుగా అవార్డును అందుకుంటున్న రాజేందర్

చిన్నచింతకుంట, మే 12 : మండలంలోని చిన్న వడ్డెమాన్ గ్రామానికి చెందిన వడ్డెమాన్ రాజేంద్రకు వండర్ బుక్ ఆఫ్ అవార్డు లభించింది. పీవీఆర్ డబ్బింగ్ అకాడమీ వారు శని, ఆదివారాల్లో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన 24 గంటల నాన్ స్టాప్ గాత్ర కళాకారుల స్వరార్చన కార్యక్రమంలో రాజేంద్ర కూడా పాల్గొన్నారు. స్వంత గ్రామంలో పుట్టి పెరిగిన నేపథ్యం, స్నేహితులు, గ్రామస్థులతో తనకున్న పరిచయాలను తెలంగాణ యాసలో రాసి, చదివి వినిపించారు. తాను రాసిన గ్రామీణ భాషను అక్కడున్న వారు మెచ్చి, అభినందించారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖా అధ్యక్షుడు మామిడి హరికృష్ణ సినిమా డైరెక్టర్ తరుణ్ భాస్కర్, డబ్బింగ్ ఆర్టిస్ట్ ఆర్‌సీఎం రాజు, పీవీఆర్ డబ్బింగ్ అకాడమీ చైర్మన్ వినోద్‌లు అభినందించారు. కాగా రాజేంద్రకు సినిమా హీరో సుమన్ చేతుల మీదుగా వండర్ బుక్ ఆఫ్ రికార్డు అవార్డును అందజేసినట్లు ఆదివారం రాజేందర్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

హరితహారానికి సిద్ధం

- వర్షాకాలంలో మొక్కలు నాటేందుకు సిద్ధం
- ప్రతీ గ్రామంలో 15 వేల మొక్కల పెంపకం
- గ్రామస్థాయి నర్సరీలలో పండ్లు, పూల మొక్కలు


దమాయపల్లిలో నర్సరీలో మొక్కలు

కోయిలకొండ, మే 12 : గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నర్సరీలలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. మండలంలోని 44 గ్రామ పంచాయతీలలో నర్సరీలు ఏర్పాటు చేసి మూడు నెలల నుంచి మొక్కలను పెంచుతున్నారు. వచ్చే వర్షాకాలం ఆరంభంలో హరితహారం పథకం కింద గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీ ద్వారానే నాటించాలన్న లక్ష్యంతో మొక్కలను పెంచుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీ నర్సరీలో 15వేల మొక్కలు, చిన్న గ్రామ పంచాయతీలో ఎనిమిది వేల నుంచి పది వేల మొక్కలను పెంచుతున్నారు. వేసవి కాలంలో ఎండలకు మొక్కలు ఎండిపోకుండా చలువ పందిళ్లు వేసి మొక్కల సంరక్షణకు నర్సరీలలో ఏర్పాట్లు చేశారు. వర్షాలు కురిస్తే మొక్కలు నాటేందుకు ఆయా గ్రామాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ స్థలాల్లో మొక్కలు నాటించాలన్న లక్ష్యంతో ప్రత్యేక అధికారులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. ఉపాధి కూలీలతో మొక్కలు నాటేందుకు గుంతలు తీయించి మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉండాలని డీఆర్‌డీవో అధికారులు గ్రామ కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ, ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా నీడనిచ్చే గుల్‌మోర్, కానుగ, వేపతో పాటు ఇతర మొక్కలను నాటించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

నాటేందుకు సిద్ధంగా మొక్కలు



మా గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాయి. మా నర్సరీలో నిమ్మ, దానిమ్మ, గోరింటాకు, తులసీ, అశ్వగంధం, మందారం, సీతాఫలం, కానుగ, మునగ, బోగన్విలియా మొక్కలు పెంచుతున్నారు. గ్రామంలో ప్రతీ ఇంటికి మొక్కలు అందించి రోడ్ల వెంట నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం

- చైతన్య కార్యదర్శి, దమాయపల్లి

లక్షా 68 వేల మొక్కల నాటించడమే లక్ష్యం



మండలంలో ఈ సంవత్సరం హరితహారం ద్వారా లక్షా 68 వేల మొక్కలు నాటించేందుకు లక్ష్యం పెట్టుకొన్నాం. గ్రామాల వారీగా ప్రత్యేక అధికారులు, కార్యదర్శులకు ఎన్ని మొక్కలు నాటించాలన్న విషయంపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించాం. అందరి సమన్వయంతో లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

- కాళప్ప ఎంపీడీవో, కోయిలకొండ

అందుబాటులో పూలు, పండ్ల మొక్కలు

మండలంలోని అయా గ్రామ పంచాయతీల్లో పూలు, పండ్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని కార్యదర్శులు వెల్లడించారు. పండ్ల మొక్కలు జామ, దానిమ్మ, బొప్పాయి, సీతాఫలం, అల్లనేరేడు, ఉసిరి, మునుగ, నిమ్మతో పాటు పూల మొక్కలు గులాబి, మందారం, చామంతి, బోగన్విలియా తదితర పూల మొక్కలతో పాటు తులసీ, మారేడు చెట్లుకూడా కొన్ని నర్సరీలో ఉన్నాయి.


జడ్చర్ల : అయ్యప్పస్వామి ఆలయంలో జగద్గురు ఆది శంకరాచార్యుల చిత్రటానికి నివాళ్లర్పిస్తున్న బ్రాహ్మణసేవా సమితి నాయకులు


ఆదిశంకరాచార్యులకు పూజలు నిర్వహిస్తున్న స్వాములు

ఘనంగా ఆది శంకరాచార్యుల జయంతి

మిడ్జిల్, మే 12 : జడ్చర్ల పట్టణంలోని బ్రాహ్మణసేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రాహ్మణసేవా సమితి జిల్లా అధ్యక్షుడు భీమాచార్యులు, ప్రధాన కార్యదర్శి గొండ్యాల రాఘవేంద్రశర్మ, శ్రవణ్‌కుమార్ శర్మల ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి ఆలయంలో ఆది శంకరాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రతీ ఒక్కరు సన్మార్గంలో ముందుకు సాగి శాంతిని నెలకొల్పేందుకు ప్రయత్నించాలని వారు కోరారు. కార్యక్రమంలో బ్రాహ్మణసేవ సమితి సీనియర్ నాయకులు బాదేపల్లి రంజిత్‌బాబు, పట్టణ అధ్యక్షులు నరేంద్రశర్మ, నాయకులు సుమన్‌శర్మ, రమాకాంత్, దత్తుకుమార్, పురుషోత్తంరావు, భాస్కర్, నరసింహారావు, జ్యోషి రాఘవేంద్రశర్మ, అంభి రామచంద్రన్, వి. రాఘవేంద్రశర్మ ఉన్నారు.

పాతబజార్ శివాలయంలో

జడ్చర్ల పట్టణంలోని పాతబజార్ శివాలయంలో జగద్గురువు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను ఆదివారం బ్రాహ్మణసేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలోని శంకరాచార్యుల విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంజనేయస్వామికి పంచామృతాభిషేకం, శివుడికి రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహారావు, ప్రదీప్‌పాటిల్, ఆలయ ధర్మకర్త భార్గవశర్మ, రాఘవేంద్రరావు, ప్రవీణ్, శ్రీధర్, శిరీష్ కుమార్, శ్రీనివాస్, వెంకట్రావు, గట్టు నవీన్, ఇరివెంటి శ్రీకాంత్, ప్రసాద్, కృష్ణశాస్త్రీ, గోనెల రాధకృష్ణ పాల్గొన్నారు.

కోయిలకొండలో...

కోయిలకొండ : మండలంలోని అభంగపట్నంలో ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శంకరాచార్యుల విగ్రహానికి ఫల పంచామృత అభిషేకం, బిల్వార్చన పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయం వద్ద అడుగుల భజన, కోలాటాల కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌స్వామి, వెంకటస్వామి, వెంకట్రాములు, వీరప్ప, రంగప్ప, రాకమయ్య, కేశవులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, మే 12 : ఎన్నిక విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన వ్యాయామ ఉపాధ్యాయుడు రామును కలెక్టర్ రవి గుగులోత్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు డీఈవో ఎ.రవీందర్ తెలిపారు. బాలానగర్ మండల పరిధిలోని నేరళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు రాము తనకు కేటాయించిన పార్లమెంట్ ఎన్నికలలో తనకు కేటాయించిన ఎఫ్ఎస్‌టీ విధులను నిర్లక్ష్యం చేసినట్లు అడిషనల్ కలెక్టర్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మోహన్‌రావు నివేదిక ప్రకారం సస్పెండ్ చేసినట్లు డీఈవో ఆదివారం తెలిపారు.

పోలింగ్‌కు అంతా సిద్ధం

దేవరకద్ర, మే 12 : పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాలల్లో అంతా సిద్ధం చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లోని మొత్తం 61 పోలింగ్ కేం ద్రాలు ఉన్నట్లు తెలిపారు. ఆ పోలింగ్ కేంద్రాల వద్ద ఓట ర్లకు కావాల్సిన అన్ని వసతులు కల్పించినట్లు తెలిపారు. దివ్యాంగులకు విల్‌చైర్ ఏర్పాటు చేశామని, అదేవిధంగా 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే ఓటు వేసే విధంగా సౌకర్యాలు కల్పించామన్నారు. మండలంలోని మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సోమవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఉంటుందని తెలిపారు. ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. గ్రామాల్లో పోలింగ్ కేంద్రా ల వద్ద 144 సెక్షన్ ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ నాగన్న తెలిపారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

మక్తల్, మే 12 : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆ సంఘం అధ్యక్షుడు గోపాలం అన్నారు. ఆదివారం పట్టణంలోని అక్షర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మక్తల్ పెన్షనర్ల సంఘంలో 450 మంది సభ్యులు ఉ న్నారని, ప్రతీ నెలా సమావేశం నిర్వహించుకోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తక్షణమే పెన్షనర్లకు 300 గజాల స్థలం కేటాయించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర మైహోం అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు సహకారంతో పెన్షనర్ల సంఘం భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. పెన్షనర్లకు రావాల్సిన నాలుగు డీఏలు, నూతన పీఆర్సీలను వెంటనే ప్రకటించి నగదు రూపంలో చెల్లించాలన్నారు. నగదు రహిత వైద్య సేవలను ఉచితంగా ప్రభుత్వం అందించాలని విజ్ఞప్తి చేశాం. అలాగే పెన్షనర్లు అయిన విద్యావతి, దేవేంద్రప్ప పుట్టిన రోజు సం దర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సూర్యప్రకాష్, పెన్షనర్ల సంఘం గౌవాధ్యక్షుడు సంజన్న, ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి సిద్ధిలింగ య్య, సుజాత, విద్యావతి, మల్లికార్జున్, తులిశప్ప, నర్సమ్మ, గోవిందు, రాములు, జగదీష్, రాంచందర్, దేవణ్ణ, ఖాదర్‌భాష, తిప్పారెడ్డి, నారాయణరెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

జోరుగా ఇసుక అక్రమ రవాణా

మాగనూరు, మే 12 : మండలంలోని మాగనూరు, వర్కూరు, నేరడుగం, ఓబులాపూర్, వడ్వాటు, గజరందొడ్డి, అడవి సత్యారం, పెగడ బండ గ్రామ శివారులో ప్రవహిస్తున్న పెద్దవా గు నుంచి రాత్రీ పగలు తేడా లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇసుక తరలిపోవడం వల్ల వాగులో వేసుకున్న బోర్లకు నీరందక పంటలు ఎండి పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానులకు అధికారుల అండదండలు ఉండడంతో పగలూరాత్రీ తేడా లేకుండా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేయడంతో పాటు ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని వాగు తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గిరిజన తండాలకు బీటీరోడ్లు పూర్తి అయ్యేనా ?

- టెండర్లు వేశారు.. పనులు మధ్యలో ఆపేశారు
- బీటీకి నోచుకోని గిరిజన తండాలు


కంకర వేసి వదిలివేసిన గేగ్యతండాకు వెళ్లే రోడ్డు

భూత్పూర్, మే 12 : గ్రామ పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా మారితే అన్ని వసతులు, సౌకర్యాలు సమకూరుతాయని గిరిజన తండావాసులు అనుకున్నారు. గిరిజనుల సమస్యలు తీరకపోగా మరిన్ని ఉత్పన్నమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. భూత్పూర్ పట్టణం 2018లో గ్రామ పంచాయతీ నుంచి మునిసి పాలిటీగా మారింది. మునిసిపాలిటీ పరిధిలో 13 గిరిజన తండాలు ఉన్నాయి. (బండమీది తండా, వాల్య తండా, మిట్యాతండా, గుబ్బడి తండా, చేర్లతండా, నర్సింగాపూర్ తండా, పిల్లిగుండు తండా, గేగ్యేతండా, వసురాంతండా, నల్లగుట్ట తండా, రాందాస్‌తండా) ఈ గిరిజన తండాలకు లింకు రోడ్ల ఏర్పాటుకు అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి రూ.12.60కోట్ల ప్రత్యేక నిధులను మంజూరు చేయించారు. సత్వరమే బీటీ రోడ్ల పనులను ప్రారంభించాలని 2023, జనవరి 31న మునిసిపాలిటీలోని 13 గిరిజన తండాలకు శంకుస్థాపన చేశారు. బీటీ రోడ్ల ఏర్పాటుకు కాంట్రాక్టర్ నామమాత్రంగా పనులు ప్రారంభించారు. కొన్ని తండాలకు వెళ్లే రోడ్లకు కంకర పోసి వదిలివేశారు. బీటీరోడ్లకు శంకుస్థాపనలు చేసి 16నెలలు కావస్తున్నా నేటికి రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడంతో ఆయా తండావాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో మునిసిపాలిటీ కమిషనర్ సురేందర్ రెడ్డిని వివరణ కోరగా తాను ఇటీవలే హైదరాబాద్ నుంచి బదిలీపై వచ్చానని, గిరిజన తండాలకు బీటీరోడ్ల విషయం తెలియదని వివరించారు.

బీటీ రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలి

మా తండాకు బీటీ రోడ్డు మంజూరు అయ్యిందంటే చాలా సంతోశ పడ్డాము. ఇంతవరకు రోడ్డు పనులు ప్రారంభించలేదు. కాంట్రాక్టర్ రోడ్డు వేస్తానని యంత్రాలు తెచ్చి తవ్వి వెళ్లిపోయాడు. మాకు చాలా ఇబ్బందిగా ఉంది. ఈ వానాకాలం మొదలు కాక ముందే పనులు ప్రారంభిస్తే మంచిగుంటది. రాక పోకలకు చాలా ఇబ్బందులు అవుతున్నాయి.

- బీక్యానాయక్, వాల్యాతండా

వానాకాలమొస్తే షానా తిప్పలు

వానాకాలం వచ్చిందంటే బురద బురదగా తయారవుతుంది రోడ్డు. మా తండాకు చాలా ఏళ్ల సంది రోడ్డు సౌకర్యం సరిగా లేదు. అమిస్తాపూర్ నుంచి రెండు కిలోమీటర్లు అవుతుంది. చిన్న పాటి వానలు వచ్చినా మొత్తం రోడ్డు బురదగా మారుతుంది. ఇస్కూలుకు పోయే పిల్లలకు షానా తిప్పలు అవుతుంది. ఇపుడన్న ఎవరైనా స్పందించి ఆగిపోయిన రోడ్డు పనులకు బాగు చేస్తే చాలా మంచిగుంటది.

- కొట్రావత్ ఆనంద్‌నాయక్, వసురాంతండా

నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం


గండీడ్ లో ఈవీఎంలతో ఎన్నికల అధికారులు, సిబ్బంది

గండీడ్, మే 12 : మండల పరిధిలో 37 పోలింగ్ బూత్‌లు, మహమ్మదాబాద్ మండల పరిధిలో 32 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఈవీఎంలతో సిబ్బందిని పంపినట్లు ఎన్నికల రూట్ అధికారి, ఎంఈవో వెంకటయ్య, టీం లీడర్, గండీడ్ ఎంపీడీవో దేవన్న తెలిపారు. ఉమ్మడి మండల పరిధిలోని అయా పోలింగ్ సెంటర్లలో ఎన్నికల సిబ్బందికి సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు.

● పోలింగ్ బూత్‌ల దగ్గర 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్ఐ శేఖర్‌రెడ్డి అన్నారు. నేడు జరగబోయే ఎంపీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల దగ్గర ఏ పార్టీలకు చెందిన వారు ఎలాంటి ప్రచారాలు చేయరాదని అన్నారు. అల్లర్లు, ఎన్నికల అధికారులకు ఇబ్బంది కల్గిస్తే, ఎన్నికల పరికరాలు ధ్వంసం చేసినా, ఓటు వేసేటప్పుడు ఫొటో, వీడియో తీయడం, దొంగ ఓట్లు వేసినా కఠినమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లు పూర్తి

కోయిలకొండ : మండలంలో 61 పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల క్లస్టర్ అధికారి జయరాం తెలిపారు. ఆయా పోలింగ్ బూత్‌లకు ఎన్నికల సామగ్రితో పాటు సిబ్బంది చేరుకున్నాయని తెలిపారు. పోలింగ్ బూత్‌ల వద్ద సిబ్బందికి టెంట్‌లు, తాగునీరు తదితర వసతులు కల్పించినట్లు తెలిపారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమవుతుందని, అందరూ ఓటు వేయాలని ప్రజలను కోరారు.


కోయిలకొండ మండలం కేశ్వాపూర్‌లో పోలింగ్ బూత్ వద్ద సామగ్రితో సిబ్బంది

ఎన్నికలకు అన్ని సిద్ధం చేసిన అధికారులు.....!

భూత్పూర్ : నేడు జరగనున్న పార్లమెంట్ ఎన్నికలకు మండలంలోని అన్ని గ్రామాల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని 35 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అదే విధంగా మునిసిపాలిటీలోని మూడు ప్రధాన గ్రామాల్లో 11 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 46 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఆదివారం సాయంత్రం వరకు ఆయా పోలింగ్ కేంద్రాలకు అధికారులు, సబ్బంది ఎన్నికల సామగ్రితో చేరుకున్నారు. అదే విధంగా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందో బస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ విధులకు వచ్చిన అధికారులకు, సిబ్బందికి అన్ని సౌకర్యాలను కల్పించినట్లుగా మండల ఎన్నికల అధికారి పులిరాజు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఈవీఎంలు

మిడ్జిల్ : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం మండలంలోని 31 పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో సిబ్బంది చేరుకున్నారు. ఎన్నికలకు 200 మందికి పైగా సిబ్బంది మండలంలోని గ్రామాలలో ఎన్నికల విధులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజునాయక్ తెలిపారు. మండలంలోని వల్లభురావుపల్లి, మిడ్జిల్ గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రాజునాయక్ పరిశీలించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

రాజాపూర్‌లో 26 పోలింగ్ కేంద్రాలు

రాజాపూర్ : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో మొత్తం 26 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి తెలిపారు. ఆయా కేంద్రాలకు ఆదివారం ఎన్నికల సామగ్రితో సిబ్బంది వచ్చినట్లు, పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని 110వ పోలింగ్ బూత్‌ను మోడల్ పోలింగ్ కేంద్రంగా, మల్లేపల్లి గ్రామంలోని 119వ పోలింగ్ బూత్‌ను మహిళా మోడల్ పోలింగ్ కేంద్రంగా సుందరీకరిం చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. మండలంలోని 26 పోలింగ్ కేంద్రాలకు ముగ్గురు అధికారులను నియమిం చినట్లు తెలిపారు. ఓటర్లందరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చర్యలు

- ఎస్ఐ తిరుపాజి

బాలానగర్, మే 12 : ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, ఐదేళ్లకోసారి వచ్చే సాధారణ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ కొనసాగేలా చూడాలని బాలానగర్ మండల ప్రజలకు ఎస్ఐ తిరుపాజి సూచించారు. ఆదివారం ఆయన ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను విలేకర్లకు వెల్లడించారు. ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లో ఉందని, గుమికూడకుండా ఉండాలని స్పష్టం చేశారు. ఇప్పటికే 60 మంది అనుమానితులను, ఐదుగురు రౌడీషీటర్లను బైండోవర్ చేసినట్లు తెలిపారు. మండలంలోని ఉడిత్యాల గ్రామాన్ని సమస్యాత్మక గ్రామంగా, పెద్దరేవల్లి, హేమాజీపూర్, మోతిఘనపూర్ గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూడు ప్రైవేట్ వెపన్స్ డిపాజిట్ చేసినట్లు తెలిపారు. మండల పరిధిలో జాతీయ రహదారిపై చెక్‌పోస్టు ఉన్నందున ఇప్పటి వరకు 17,417 లీటర్లు మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీలలో సుమారు రూ.37లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ప్రజలను కోరారు.